

**పల్లె పోరుకు సై**

పంచాయతీల పదవీకాలం జనవరి 31తో ముగియనుండటంతో పల్లె పోరుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. 8లో▸



**ఎవరి పంతం వారిదే**

వికారాబాద్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవి నియామకంలో మొదలైన మునలం.. నానాటికీ ముదురుతోంది. 8లో▸



**రేషన్.. పరేషాన్**

నూతన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

# బీసీ సాయం అందేనా?

- జిల్లాలో కార్పొరేషన్ రుణాల కోసం 13,157 దరఖాస్తులు
- 9,754 మందిని ఎంపిక చేసిన గత ప్రభుత్వం
- మొదటి విడతలో 1,400 మందికి రూ.లక్ష సాయం అందజేత
- ప్రభుత్వం మారడంతో అయోమయంలో మిగితా దరఖాస్తుదారులు



రుణాల కోసం దరఖాస్తు చేస్తున్న బీసీ కులవృత్తిదారులు (ఫైల్)

**వికారాబాద్ అర్బన్:** బీసీ కులవృత్తుల వారిని ప్రోత్స హించే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఆరునెలల ముందు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించింది. దీంతో జిల్లాలోని అనేక బీసీ కులవృత్తుల లబ్ధిదారులు ప్రభుత్వ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎన్నిక లకు ముందు ఈ పథకం ద్వారా కొందరికి ఆర్థికసాయం కూడా అందింది. అయితే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ పథకం కొనసాగుతుందా లేదా..? అనే అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం అమలుపై ఇప్పట్లో క్లారిటీ ఇచ్చే అవకాశం లేకపోవ డంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు మొదటి విడతలో కొందరు రూ.లక్ష లబ్ధిపొందారు. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 300 మంది లబ్ధి దారుల చొప్పున మొత్తం 1,200 మంది వరకు రూ.లక్ష సహాయం అందుకున్నారు. రెండో విడతలో కూడా నియోజకవర్గానికి 200 చొప్పున బీసీ వెల్ఫేర్ అధికారులు జాబితాను సిద్ధం చేసి పెట్టారు. అయితే కొత్త ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తేగాని లక్ష ఆర్థిక సహాయం అందే అవకాశం లేదు.

**2016 నుంచి అందని రుణాలు**

గత ప్రభుత్వం 2016 నుంచి జిల్లాలో బీసీ కార్పొరే షన్ రుణాలు ఇవ్వలేదు. ఎన్నికల ముందు తీసుకొ చ్చిన బీసీ కులవృత్తిదారుల పథకంతో కొంతైనా లబ్ధి పొందుతామని అనుకున్న కులవృత్తుల వారికి ప్రభుత్వం మారడం నిరాశను కలిగిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 6వేల కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా ఏర్ప డిన కాంగ్రెస్ ప్రభుత్వం పెడింగ్‌లో ఉన్న కార్పొరే షన్ రుణాలను ఇస్తే తమకు కొంతైనా మేలు జరిగే అవకాశం ఉందని లబ్ధిదారులు కోరుతున్నారు.

**ఎమ్మెల్యేల జోక్యంతో అభాసుపాలు..!**

గత ప్రభుత్వ హయాంలో బీసీ కులవృత్తిదారుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవడం తో ఈ పథకం అభాసుపాలైనట్లు విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారుల ఎంపిక అనేది.. పైకి బీసీ కార్పొరేషన్ అధికారులు చేసినట్లే చెప్పినా.. అంతర్గ తంగామాత్రం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సూచించిన పేర్లు మాత్రమే ఎంపిక చేసినట్లు ఆరో పణలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించినా పారదర్శకంగా ఎంపిక ఉండాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పాత లబ్ధిదారుల పేర్లు ఉంటాయా ఉండవా అనే గందరగోళం దరఖా నెలకొంది.

**13వేలకు పైగా దరఖాస్తులు**

ఈ పథకం కింద రుణాలు అందించేందుకు 14 బీసీ కులవృత్తిదారుల నుంచి గత ప్రభుత్వం దరఖా స్తులు కోరింది. నాయీబ్రాహ్మణ, ఉప్పరి, అవుస లి, రజక, కుమ్మరి, కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, పూసల, మేదర, వడ్డెర, ఆరెకటికలతో పాటు ఎం బీసీ కులాల వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 13,157 దరఖాస్తులు రాగా క్షేత్ర స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు విచారణ చేసి మొత్తం 9,754 మందిని జాబితాను ఎంపిక చేశారు. ఇందులో మొదటి విడతలో 1,400 మందికి రూ.లక్ష సహాయం అందించారు. మిగితా వారికి తదుపరి విడతల్లో సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మిగిలిన 8,354 మంది దరఖాస్తుదారులకుతఈ పథకం ద్వారా ఆర్థికసాయం అందుతుందా లేదా..?అనే అనుమానం నెలకొంది. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

| | | |
|---|---|---|
| జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులు | - | 13,157 |
| ఎంపికైన వారు | - | 9,754 |
| మొదటి విడతలో డబ్బులు పొందినవారు | - | 1,400 |
| ఎదురుచూస్తున్నవారు | - | 8,354 |

**ఎలాంటి ఆదేశాలు రాలేదు**

కులవృత్తులవారికి రూ.లక్ష సహాయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో లబ్ధిదా రులకు ఆర్థికసహాయం అందించాం. అర్హుల జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ఆదేశిస్తే మిగ తావారికి అందించే ఏర్పాట్లు చేస్తాం.

– ఉపేందర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి

## న్యూస్‌రీల్

### నియామకం



వెంకటేశం

**కొడంగల్ రూరల్:** విని యోగదారుల ఫోరం రాష్ట్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పట్టణా నికి చెందిన ఎం.వెం కటేశం నియమితుల య్యారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని మాల మహా నాడు కార్యాలయంలో నేషనల్ వినియోగదా రుల ఫోరం వైస్ ప్రెసిడెంట్ బి.పూర్ణచంద ర్‌గౌడ్‌చేతుల మీదుగా కొడంగల్‌కి చెందిన వెం కటేశం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వెంకటేశంను ఘనం గా సన్మానించారు.

### ఎస్టీ జాబితాలో చేర్చండి

ఎమ్మెల్యే టీఆర్‌ఆర్‌కు వడ్డెర సంఘం నేతల వినతి



టీఆర్‌ఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**పరిగి:** వడ్డెర కులస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాల యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సం ఘం నాయకులు మాట్లాడుతూ.. తాము నేటికీ అడవిని నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. మా సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకె ళ్లి వాటిని పరిష్కరించేవిధంగా చర్యలు తీసు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మణి, ప్రధాన కార్యదర్శి అంజిలయ్య, యాదయ్య, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

**తాండూరు:** పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం పడిపూజ కార్య క్రమం వైభవంగా నిర్వహించారు. మాజీ మం త్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, వారి తన యుడు రినీష్‌రెడ్డి, కూతురు మనీషారెడ్డి, అల్లుడు హిమదీప్‌రెడ్డి తదితరులు పాల్గొ న్నారు. గురుస్వాములు, అయ్యప్పస్వామి మాలధారణ చేసిన స్వాములు ఉత్సవ విగ్రహా నికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాభి షేకం, మహామంగళహారతి, 18 మెట్ల పూజ నిర్వహించారు. తాండూరు మున్సిపల్ చైర్‌ప ర్సన్ స్వప్న, కౌన్సిలర్లు శోభారాణి, నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైర క్టర్ రవిగౌడ్, నాయకులు పురుషోత్తంరావు, శ్రీనివాస్, బిర్కట్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి దొరకదనే చదవడం లేదు

- బడిమానేసిన విద్యార్థుల ఆవేదన
- కౌన్సెలింగ్ ఇచ్చిన యంగ్ లైవ్స్ ఇండియా సంస్థ ప్రతినిధులు

**బొంరాస్‌పేట:** చదువుకున్న తర్వాత ఉద్యో గం, ఉపాధి ఉండదనే ఆందోళనతో తాము బడికి వెళ్లట్లేదని, మధ్యలోనే మానేయడం చేస్తున్నామని బడిబయటి పిల్లలు, బడిమానే సిన విద్యార్థులు ఓ జాతీయ సంస్థ ప్రతి నిధులకు నివేదించారు. ఆదివారం ఢిల్లీకి చెం దిన యంగ్ లైవ్స్ ఇండియా సంస్థ వారు బొం రాస్‌పేటలో బడిబయటి పిల్లల సర్వే చేపట్టారు. పి.రాఘవేందర్, ఎం.తిరుపతి, జి.నరేశ్, బి.నర్సింహులు, ఎం.అరుణ్ అనే ఐదుగురిని గుర్తించారు. వారందరిని మండల కేంద్రంలోని పాఠశాలలో సమూహం చేసి బడిబయట ఉండటానికి కారణలను అడిగి తెలుసుకున్నారు. చదువుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, ఉపాధి, ఉద్యోగ అవ కాశాల గురించి వారికి వివరించారు. వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. బడి మానేయాడికి కారణాలను వ్యక్తిగతంగా విశ్లే షించి అవగాహన కల్పించారు. తమ సంస్థ బాల్యవివాహాలు, బాలకార్మికుల నిర్మూ లనకు కృషి చేస్తుందని అన్నారు. ఇందులో సంస్థ ప్రతినిధులు మాధవీలత, రాజేశ్, సీఆ ర్‌పీ సోమ్లా తదితరులున్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

క్షేత్ర హిందూ ధర్మ జాగరణ ప్రముఖ్ అమరలింగన్న

**అనంతగిరి:** యావత్ హిందూ సమాజం సంఘ టిత శక్తిగా ఎదగాలని క్షేత్ర హిందూ ధర్మ జాగ రణ ప్రముఖ్ అమరలింగన్న అన్నారు. ఆది వారం వికారాబాద్ పట్టణంలోని రామమంది రానికి చేరుకున్న అయోధ్య రామమందిర అక్షిం తలను జిల్లాలోని ఆయా మండలాలకు పంపిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో అమరలింగన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హిందూధర్మ పరిరక్షణకు పాటుపడా లన్నారు. జనవరి 22న శ్రీరామ జన్మభూమి అయోధ్యలో భవ్య రామమందిరంలో శ్రీరా ముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నా రన్నారు. ప్రతి గ్రామంలోని గడపగడపకు స్వామివారి ప్రాణప్రతిష్ఠ అక్షింతలు చేరవే యాలని అయోధ్య రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ నిర్ణయించిందన్నారు. వీహెచ్‌పీ జిల్లా ప్రతిని ధులు ప్రశాంత్, అనంత్‌రెడ్డి, సత్యనారాయ ణగౌడ్, సదానంద్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్‌కు అయోధ్య రాముడి అక్షింతలు**

**కొడంగల్ రూరల్:** అయోధ్య రామ మందిరం యొక్క అక్షింతలకు జిల్లా కేంద్రంలోలోని అనం తగిరి క్షేత్రం రామ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన అక్షింతలను హిందూవాహిని శాఖ సభ్యులకు అందజేశారు. హిందూ వాహిని సభ్యులు, భక్తులు కొడంగల్ అభయాంజనేయస్వామి ఆలయంలో అయోధ్య రాముడి అక్షింతలు, కళశానికి పూజలు నిర్వహిం చారు. జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నియోజకవర్గంలోని ప్రతీ గడపకు అయోధ్య రాముడి అక్షింతలను అందించనున్నట్లు హిం దూవాహిని శాఖ సభ్యులు తెలిపారు. కార్యక్ర మంలో ఎల్లయ్యగుప్త, ఆనంద్, లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వెంక టయ్య,రాకేష్, ఓంప్రకాష్, హిందూవాహినిశాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అక్షింతలు అందుకున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

# జీఓ 371తో ఉపాధ్యాయులకు నష్టం

సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ

**తుర్కయంజాల్:** జీఓ నెంబర్ 371 అమలుతో జిల్లాలోని ఉపాధ్యాయులకు తీవ్రం నష్టం వాటిల్లిం దని సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యులు మధూకర్ రెడ్డి, బొడ్డు రవి అన్నారు. ఆదివారం హస్తినాపురం, టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కె.శ్రీని వాస్, శంకర్ నాయక్, కె.శ్రావణ్ కుమార్, తలారి నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, గణేశ్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకానాథ్

# సమాజ సేవలో భాగస్వాములు కావాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ద్వారకానాథ్

**అనంతగిరి:** పింఛన్‌దారులు సమాజసేవలో భాగ స్వాములు కావాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హారతీ ద్వారకానాథ్ కోరారు. స్థానిక సత్యసాయి జ్ఞానకేంద్రంలో ఆదివారం పెన్షన్‌దారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సభ్యులకు చక్కని సలహాలందించాలనీ, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. రోజు 20 నిమిషాల నడక, ప్రాణయామం, ధ్యానం ఏదో ఒకటి చేయాలని కోరారు. ప్రతిరోజు వార్తలు చూడటం, పుస్తక పఠనం మొదలగునవి చేయాలన్నారు. స్థానికంగా ఉన్న నిరుపేదలకు సహాయం చేయాల న్నారు. వికారాబాద్ మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాణిక్యప్రభు మాట్లాడుతూ.. ప్రభుత్వ పెన్షన్ విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చేది బహుమానం కాదని అలాగే దయతో చెల్లించే ఎక్స్ గ్రేషియా కాదని గతంలో వారు చేసిన సేవలకు చెల్లింపని తెలిపారు. పింఛన్‌దారులందరికీ నగదు రహిత వైద్య చికిత్సలు, బస్సుల్లో 50శాతం రాయితీ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా 73 సం వత్సరాలు దాటిన విశ్రాంత ఉద్యోగులు 30మం దిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహారెడ్డి, బస్వరాజు, జూకారెడ్డి, బంద్వెగౌడ్, పాపయ్య, సతీష్‌చంద్ర, విటోభా, అంబదాసు, బెంజిమిన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బలగం వచ్చింది

- సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా విశ్వప్రసాద్
- అదనపు సీపీ క్రైమ్స్‌గా రంగనాథ్
- వెస్ట్ జోన్ డీసీపీగా విజయ్‌కుమార్
- టాస్క్‌ఫోర్స్‌కు మరో మహిళా బాస్
- పలువురు ఐపీఎస్‌లకు స్థానచలనం

**సాక్షి, సిటీబ్యూరో:** రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు విభా గంలో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా సిటీ కేంద్రంగానే ఇవి జరిగాయి. ప్రస్తుతం నగర నిఘా విభాగం స్పెషల్ బ్రాంచ్‌కు నేతృత్వం వహిస్తున్న పి.విశ్వప్రసాద్‌ను ట్రాఫిక్ చీఫ్‌గా మార్చారు. ఇక్కడ పని చేసిన జి.సుధీర్‌బా బు ఇటీవలే రాచకొండ పోలీసు కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. వరంగల్ సీపీగా పని చేస్తూ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీలతో వెయిటింగ్‌లోకి వచ్చిన ఏవీ రంగనాథ్‌ను కీలకమైన క్రైమ్స్, సిట్ విభాగాలకు అదనపు సీపీగా నియ మించింది. ఈయనకు గతంలో నగర ట్రాఫిక్ డీసీ పీగా, చీఫ్‌గా పని చేసిన అనుభవం ఉంది. సైబరా బాద్ ట్రాఫిక్ విభాగం డీసీపీగా పని చేసిన ఎస్ఎం విజయ్‌కుమార్‌ను గత ప్రభుత్వం ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ చేసింది. కొన్నాళ్లుగా అక్కడే ఉన్న ఆయన సిటీలోనే అత్యంత కీలకమైన వెస్ట్‌జోన్ డీసీపీగా పోస్టింగ్ పొందారు. ఇక్కడ పనిచేస్తున్న జోయల్ డేవిస్‌ను సిటీ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈయనకు త్వరలోనే డీఐజీగా పదోన్నతి రానుంది. దీంతో జోయల్.. విశ్వప్రసాద్ మాదిరిగా స్పెషల్ బ్రాంచ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. గతంలో నార్త్‌జోన్ డీసీపీగా పని చేసి, ప్రస్తుతం మెదక్ ఎస్పీగా ఉన్న రోహిణీ ప్రియదర్శిని మళ్లీ సిటీకి వచ్చారు. అదే నార్త్‌జోన్ డీసీపీగా పోస్టింగ్ పొందారు. సిద్దిపేట పోలీసు కమి షనర్‌గా ఉన్న శ్వేత డీసీపీ డీడీగా, వెయిటింగ్‌లో ఉన్న సుబ్బారాయుడు ట్రాఫిక్ డీసీపీ–3గా బదిలీ అయ్యారు. ఎన్నికల సంఘం బదిలీల నేపథ్యంలో నగర టాస్క్‌ఫోర్స్‌కు తొలిసారిగా మహిళా బాస్ వచ్చారు. ఐపీఎస్ అధికారిణి నితిక పంత్ ఈ పోస్టులోకి వచ్చారు. తాజాగా ఈమెను బదిలీ చేసిన ప్రభుత్వం మరో మహిళా అధికారి శ్రీబాలదేవిని నియమించింది. దీంతో సిటీలో మహిళా అధి కారుల సంఖ్య గతంకంటే గణనీయంగా పెరిగింది. సైబరాబాద్‌లో అత్యంత కీలకమైన మాదాపూర్ జోన్‌కు డీసీపీగా పని చేస్తున్న సందీప్‌ను రైల్వే ఎస్పీగా మార్చింది. వెయిటింగ్‌లో ఉన్న ఎస్పీ వెం కటేశ్వర్లును సిటీట్రాఫిక్ డీసీపీ–3గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలోనే మరిన్ని బదిలీలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# వెల్‌కమ్ స్పీకర్

- శాసనసభాపతి హోదాలో తొలిసారి వికారాబాద్‌కు ప్రసాద్‌కుమార్
- ఘన స్వాగతం పలికిన కలెక్టర్, అధికారులు



వికారాబాద్: గౌరవ వందనం స్వీకరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి

**వికారాబాద్:** శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేప ట్టిన అనంతరం తొలిసారి తన సొంత నియోజక వర్గం వికారాబాద్ వచ్చిన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఘన స్వాగతం లభించింది. గడిచిన మూడు రోజులు వరుసగా అసెంబ్లీ సమావేశాలతో బిజీబి జీగా గడిపిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదివారం వికారాబాద్‌కు వచ్చారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. గెస్ట్‌హౌస్ ఆవరణలోనే ఉన్న అమరవీరుల స్థూపా నికి స్పీకర్ నివాళులు అర్పించారు. అనంతరం గెస్ట్ హౌస్‌లో కలెక్టర్, అధికారులతో స్పీకర్ సమావేశమ య్యారు. ప్రజలు కార్యకర్తలు, నాయకులు సైతం అనేకమంది అక్కడికి చేరుకున్నారు. దీంతో గెస్ట్ హౌస్ ప్రాంగణం మొత్తం హడావుడిగా మారింది.

**లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం**

**అనంతగిరి:** లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని క్లబ్ ఫంక్షన్‌హాల్ ఆవ రణలో లయన్స్‌క్లబ్–తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పలువురు వికలాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు, కృత్రిమ కాళ్లు తదితర వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తనవంతు సహ కారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. మెడికల్ క్యాం పులు కూడా నిర్వహించాలని అందుకు తాను సహ కరిస్తానన్నారు. తాను కూడా లయన్స్‌క్లబ్‌లో సభ్యు డిగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు విజయ్‌పాల్‌రెడ్డి, కవితారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీను, సుందర్, లవకుమార్, సుదర్శన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అభిలాష్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ**

**మోమిన్‌పేట:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడటంతో పాటు ఎదుటివారి దాడిలో చనిపో యిన మోమిన్‌పేట మండలం మల్లారెడ్డిగూడెంకు చెందిన అభిలాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ఇరు వాహనదారులకు గాయాలైన ప్పటికీ అభిలాష్‌రెడ్డిపై దాడిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ దాడిలో అభిలాష్‌రెడ్డి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. దాడు లకు పాల్పడిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసు కుంటామన్నారు.ఆయన వెంట సర్పంచ్ రాజశే ఖర్, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, మహంత్‌స్వామి తదితరులు ఉన్నారు.

**కార్యకర్త పెళ్లికి హాజరు**

**ధారూరు:** ధారూరు మండల పరిధిలోని కేరెల్లిలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్త మోత్కూర్ అనిల్ పెళ్లికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మార్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీ ర్వదించారు. ఆయన వెంట కేరెల్లి ఎంపీటీసీ శ్రీని వాస్, కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి, దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో ప్రజాపాలన

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు:** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయక త్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకా రం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయ ణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో గాడితప్పిన ఆర్థిక వ్యవ స్థను దారిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టిందన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారా యణరెడ్డి విజయం సాధించడంతో నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఆమనగల్లు, మాడ్గు ల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కసిరెడ్డిని పూలమా లలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫె స్టోను ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం శాఖల వారీగా శ్వేతపత్రాలు విడు దల చేయనున్నారన్నారు. ఫార్మాసిటీ రద్దు చేసి మె గా టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మెగాటౌన్‌షిప్‌తో ఈ ప్రాంతం అభివృద్ధి చెందటం తో పాటు తదనంతరం వచ్చే ఐటీ కంపెనీల ద్వారా స్థానిక యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు వస్తాయన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉం టామన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాడ్గుల మండల అధ్యక్షు డు బట్టు కిషన్‌రెడ్డి, నాయకులు సోమయ్య, మల్ల య్య, జంగయ్య, శేఖర్, ఓంప్రకాశ్‌రెడ్డి, రఘురాము లు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి**

**కడ్తాల్:** ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవం త్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. మం డల కేంద్రానికి చెందిన ముస్లింలు ఆదివారం హైద రాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కసిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మసీ ద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

**కుల్కచర్ల:** విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువుముందలి తండా(కే) గ్రామ పంచాయతీకి చెందిన కేతావత్ ప్రకాష్.. వివాహం నిమిత్తం పొరుగు ఇంటి ఎదుట వంటలు వండుతున్నారు. కాగా ఆదివారం తెల్లవారు జామున మూడవత్ మాణిక్యమ్మ(62) ఇంటి బయటకు వస్తున్న క్రమంలో వంటపనుల నిమిత్తం విద్యుత్ వైర్లు చుట్టి ఉన్న ఇనుప కడ్డీలను పట్టుకుంది. దీంతో కరెంట్ షాక్ తగిలి, ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కూమారుడు గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

**పహాడీషరీఫ్:** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ గ్రామానికి చెందిన యంజాల శ్రీనివాస్(57), అతడి భార్యకు అప్పుడప్పుడు గొడవలు జరుగుతుంటాయి. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్.. ఆదివారం తెల్లవారు జామున 5 గంటలకు కుటుంబ సభ్యులు నిద్ర లేచి చూడగా.. గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

**యాచారం:** ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన అమీర్‌పేట ఐలమ్మ(55), ఆమె కూతురు శోభ శుక్రవారం వ్యవసాయ పొలం నుంచి నడుచుకుంటూ గ్రామానికి వెళ్తున్న క్రమంలో సాగర్ రోడ్డుపై ఉన్న గేట్‌ను దాటుతున్నారు. అదే సమయంలో గునుగల్ గేట్ నుంచి యాచారం వైపు బైక్‌పై వెళ్తున్న తేజరాం , ఇద్దరిని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తల్లీకూతురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐలమ్మ ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సైదయ్య తెలిపారు.

### రాజీకి ఇదే మంచి మార్గం



సీఐ రాజశేఖర్

**మాడ్గుల:** జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ రాజశేఖర్ కోరారు. ఈ నెల 21 నుంచి 30 వరకు అమనగల్లు కోర్టులో జాతీయ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పెట్టిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీకి ఇది మంచి మార్గమని, ప్రతీకారాలకు పోకుండా.. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. స్నేహ భావంతో మెలగడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. రాజీతో సమయం కలిసి వస్తుందని సీఐ పేర్కొన్నారు.

### వైద్య శిబిరాలతో మేలు

**మొయినాబాద్‌రూరల్:** వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని కేతిరెడ్డిపల్లి సంఘ సేవకుడు గొడుగు వసంతయాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం మెగా మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొడుగు వసంత యాదయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాలు పంచుకోవాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యుల సహకారంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.



# పల్లె పోరుకు సై

- జనవరి 31తో ముగియనున్న సర్పంచ్ పదవీకాలం
- స్థానిక సమరానికి సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు
- పోటీకి ఉత్సాహం చూపుతున్న యువత
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



పంచాయతీ కార్యాలయం

**దౌల్తాబాద్:** పంచాయతీ పాలకవర్గం పదవీకాలం జనవరి 31తో ముగియనున్న నేపథ్యంలో పల్లె పోరుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నెలలో స్థానిక ఎన్నికలు ఉంటాయన్న వార్తలు వినిపిస్తుండటంతో సర్పంచ్ పోటీకి ఔత్సాహకులు ఉత్సాహం చూపుతున్నారు. ముఖ్యంగా ఈ సారి యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. ఎలాగైనా పంచాయతీలో నెగ్గాలనే పట్టుదలతో.. ఓటర్లను ప్రసన్నం చేసుకునే యత్నంలో ఉన్నారు.

**పోటీ తీవ్రం..**

నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ పదవికి తీవ్ర పోటీ ఉన్నట్లు సమాచారం. అందుకు ఆశావహులు ఇప్పటి నుంచే అటు ఓటర్లు, ఇటు మండల స్థాయి నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. తానే బరిలో ఉన్నానంటూ కొందరు ప్రచారమూ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

**రిజర్వేషన్లపై ఆందోళన**

జనరల్ స్థానాలపై పోటీ అధికంగా ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లను పదేళ్ల వరకు ఉండేలా గత పంచాయతీ ఎన్నికల్లో చట్టం చేసింది. దీంతో ఈ సారి కూడా అవే రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం రిజర్వేషన్లు మార్పు చేసేందుకు సిద్ధమైతే.. అవి తారుమారు అయ్యే అవకాశం ఉంది. రెండేళ్లుగా సర్పంచ్ పదవికోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టామని, రిజర్వేషన్లు మారితే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన కొందరిలో మొదలైంది. రిజర్వేషన్లు అనుకూలిస్తే విజయం సాధించేందుకు ఎంతైనా వెచ్చించడానికి వెనుకాడను అని పలువురు అన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బరిలో నిలిచే వారు.. యువజన సంఘాలు, కులసంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. తాయిలాలు సమర్పించుకుంటున్నట్లు సమాచారం.

# రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

**మర్పల్లి:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన మర్పల్లి పీఎస్ పరిధి కోట్‌మర్పల్లి పంచాయత్‌రాజ్ శాఖ రహదారిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. మోమిన్‌పేట్ మండలం మెరంగపల్లి గ్రామానికి చెందిన పులిగారి నర్సింహులు (28) భార్య, పిల్లలతో కలిసి బైక్‌పై కోట్‌మర్పల్లి గ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యులను బంధువుల వద్ద వదిలి, తిరిగి రాత్రి 8 గంటల సమయంలో కోట్‌మర్పల్లికి చెందిన తుడుము మల్లయ్యను తన బైక్‌పై ఎక్కించుకుని మర్పల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోట్‌మర్పల్లి గ్రామానికి చెందిన పోచారం రాజు, శ్రీనివాస్‌లు పల్సర్ బైక్‌పై కోట్‌మర్పల్లికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న నర్సింహులు బైక్‌ను.. రాజు బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో నర్సింహులు తలకు తీవ్రగాయాలు అయి, అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన గ్రామస్తులు క్షతగ్రాతున్ని మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన అక్కడి వైద్యులు నర్సింహులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాలతో ఉన్న మరో ముగ్గురికి ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించారు. మృతుడి కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

# నియామకం

**ఆమనగల్లు:** రాష్ట్రీయ వానరసేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు ప్రభాకర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్‌రాంరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. దేవాలయాలు, వాటి భూముల పరిరక్షణకు పాటు పడతానని, హిందూధర్మ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.



ప్రభాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాంరెడ్డి

# గుప్త నిధుల కలకలం!



పెకిలించిన శివలింగం

**శివలింగాన్ని వెలికితీసిన దుండగులు**

**యాలాల:** పొలంలో ఉన్న భారీ శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు పెకిలించి, పక్కన పడేశారు. ఈ సంఘటన యాలాల మండల పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల గ్రామానికి చెందిన గంగుల వెంకట్‌రెడ్డి తనకున్న 9 ఎకరాల పొలాన్ని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన నర్సింహ్మరెడ్డికి కౌలుకు ఇచ్చారు. ప్రస్తుతం అందులో కంది, వరిని సాగు చేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం పొలంలో కంది పంట ధ్వంసం అయినట్లు కౌలురైతు గమనించాడు. వెళ్లి పరిశీలించగా.. పొలంలోని శివలింగాన్ని బయటికు తీసిన ఆనవాళ్లను గుర్తించాడు. విషయాన్ని పొలం యజమానికి వివరించాడు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు, కళ్లు కవర్లను స్థానికులు గుర్తించారు. సుమారు 5 అడుగులు శివలింగాన్ని వెలుపలకు తీయాలంటే ఐదారుగురి సాయం అవసరమవుతుందని, ఇదంతా గుప్త నిధుల కోసమే జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తంచేశారు. యాలాల చుట్టుపక్కల పెద్ద మొత్తంలో శివలింగాలు ఉండటం, తరుచూ గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగడం జరుగుతుంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు. రైతు వెంకట్‌రెడ్డి ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటన స్థలంలో వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# బోరు మోటార్ల వైరు చోరీ

**మొయినాబాద్:** రాత్రి వేళలో కొందరు దుండగులు ఇరవై వ్యవసాయ బోరుమోటార్ల కేబుల్ వైర్లను దొంగిలించారు. ఈ సంఘటన మండల పరిధి తోలుకట్టలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో కొందరు దుండగులు బోరు మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించుకుపోయారు. స్టార్టర్ బాక్స్ నుంచి బోరులోకి ఉండే కేబుల్ వైర్‌లో రాగి తీగలు ఉండగా.. వాటికోసం దొంగలు కేబుల్ తీగలను చోరీకి తెగబడ్డారు. గ్రామానికి చెందిన బొక్క వెంకట్‌రెడ్డి, భుజంగరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, సురేష్, వెంకటేశ్ తదితర రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వైర్లను అపహరణకు గురయ్యాయి. రైతుల ఫిర్యాదు అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. రెండు నెలల క్రితం కనకమామిడి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో దొంగలు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వసం చేసి రాగితీగలు చోరీ చేశారు. ఇలా పలు మార్లు దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేని స్థానికులు ఆరోపించారు. ఫిర్యాదు చేసినా.. ఎవరినీ పట్టుకోలేక పోయాలరని విమర్శించారు. దీంతో దొంగలకు తాళం చెవి ఇచ్చినట్లయిందని వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ పెంచి, దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

# ఎవరి పంతం వారిదే



మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

**తెరపైకి మళ్లీ అవిశ్వాసం**

- బీజేపీ, ఎంఐఎంను కూడగట్టే ప్రయత్నంలో బీఆర్ఎస్
- చేజారుతున్న గులాబీ కౌన్సిలర్లు
- బలపడుతున్న కాంగ్రెస్!
- పట్టుదలతో ఉన్న వికారాబాద్ చైర్‌పర్సన్

**వికారాబాద్ అర్బన్:** రెండేళ్ల క్రితం చైర్‌పర్సన్ పదవి నియామకంలో మొదలైన ముసలం.. నానాటికీ ముదురుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి, ఎమ్మెల్యే మారినా చైర్‌పర్సన్ కుర్చీ విషయంలో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా.. చైర్‌పర్సన్ మంజులను గద్దె దించాలనే పట్టుదలతో కారు శ్రేణులు పావులు కదుపుతున్నారు. అయినా సరే.. అవిశ్వాసం పెట్టినా, పంతం నెగ్గించుకోవాలనే ప్రయత్నంలో చైర్‌పర్సన్ ఉన్నారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ నాయకులు వారం పది రోజులుగా ఇదే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్ల ఇంటికి వెళ్లి అవిశ్వాసానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. వీరి ప్రయత్నం ఇలా ఉండగా, బీఆర్ఎస్ నుంచి ఒక్కో కౌన్సిలర్ చేజారి పోతుండటం వారిని కొంత కలవర పెడుతోంది.

**అవిశ్వాసం దిశగా..**

ఈ ఏడాది ప్రారంభం జనవరిలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులపై అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఇవ్వాలని సొంత పార్టీకి చెందిన 23 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు. దీంతో చైర్‌పర్సన్.. అవిశ్వాస తీర్మానాన్ని సవాల్ చేస్తూ హై కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో అవిశ్వాసం సాధ్యం కాలేదు. చైర్‌పర్సన్ తీసుకొచ్చిన స్టే ఎన్నికల ముందు కోర్టు ఎత్తివేసింది. సాధారణ ఎన్నికలు ముగియడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మరోసారి తీర్మానం పెట్టే ఆలోచన ఉన్నట్లు సమాచారం. అందుకు అసెంబ్లీ ఎన్నికలకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఎంపీ రంజిత్ రెడ్డి, సొంత పార్టీ కౌన్సిలర్లతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

**ఎవరి బలం ఎంత?**

మున్సిపాలిటీలో మొత్తం 34 కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీకి 26, కాంగ్రెస్ 6, బీజేపీ 1, ఎంఐఎం 1 స్థానాలు గెలుచుకున్నాయి. బీఆర్ఎస్‌లో చైర్‌పర్సన్ కుర్చీపై చోటుచేసుకున్న వివాదాల కారణంగా చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, మరో కౌన్సిలర్ చందర్ నాయక్‌లు గులాబీలో ఒక జట్టుగా ఏర్పడ్డారు. దూరంగా ఉంటూ వచ్చారు. ఇదే సమయంలో నాటి ఎమ్మెల్యే ఆనంద్ ప్రోత్సలంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు 23 మంది జనవరిలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుమతి కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అవిశ్వాసంపై కోర్టు స్టే రావడంతో అది సాధ్యం కాలేదు. ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ చందర్ నాయక్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటే బీఆర్ఎస్‌కు 2/3 మెజార్టీ ఉండాలి. అంటే 23 మంది కౌన్సిలర్ల బలం అవసరం. నిన్నటి వరకు ఆ పార్టీకి ఆ సంఖ్యా బలం ఉండేది. బీఆర్ఎస్‌కు చెందిన 31వ వార్డు కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, 28వ వార్డుకు చెందిన మోముల స్వాతి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ బలం 21కి పడిపోయింది. అందులో 19 వార్డు కౌన్సిలర్ ఆర్. నర్సింహులు చనిపోగా.. ఆ సంఖ్య 20కి పరిమితం అయింది. చైర్‌పర్సన్ తనపై పెట్టిన అవిశ్వాసాన్ని ఎదుర్కోవాలంటే 1/3 అంటే 11 మంది కౌన్సిలర్లు ఉంటే సరిపోతుంది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో కలిపి ఇప్పటికే ఐదు మంది కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాసాన్ని ఎదుర్కొనే వారు 11 మంది బలం పొందగలిగారు. పైగా ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే ఉంటారు. ఎమ్మెల్యే ఓటుతో కాంగ్రెస్‌కు 12 మంది బలం ఉండనుంది. ఎంఐఎం అభ్యర్థి బీఆర్ఎస్‌కు మద్దతు పలికినా వారి సంఖ్య 22కు మాత్రమే చేరనుంది. బీజేపీ అభ్యర్థి ఎవరికి మద్దతు ఇచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం ఉన్న సంఖ్యా బలాల ప్రకారం అవిశ్వాసం పెట్టినా వీగిపోయే అవకాశం ఉంది.

**బీఆర్ఎస్ వాళ్లను చేర్చుకోవద్దు**

పదేళ్లుగా అధికారంలో లేకపోయినా పార్టీని నమ్ముకొని ఉన్న తమను కాదని బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన కౌన్సిలర్లను, ఇతర నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డిని నాయకులు కోరినట్లు సమాచారం. ప్రస్తుత కౌన్సిలర్లపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, వారిని పార్టీలో చేర్చుకుంటే తమ రాజకీయ భవిష్యత్ ఏమిటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అవిశ్వాసం పెట్టినా ఎదుర్కొనే సంఖ్యాబలం ఉండటంతో ఇక పార్టీలో చేర్చుకోవడం ఆపివేయాలని కోరినట్లు తెలిసింది.

# దండిగా ధాన్యం

ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను విక్రయించేందుకు అన్నదాతలు మార్కెట్ బాట పట్టారు. వ్యాపారులు (కమీషన్ ఏజెంట్లు) అధిక ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో రైతులకు సిరుల పంట పండింది. దీంతో దిగుబడిని వారికే అమ్ముతున్నారు. ఇక రికార్డు స్థాయిలో ధాన్యం తరలి వస్తుండటంతో.. మార్కెట్ యార్డు కళకళలాడుతోంది.

**షాద్‌నగర్ మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు**

- గతేడాది కంటే మెరుగైన ధర
- రికార్డు స్థాయిలో వరి కొనుగోళ్లు
- ఇప్పటి వరకు 1.44లక్షల క్వింటాళ్ల సేకరణ



షాద్‌నగర్ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యం

**షాద్‌నగర్:** వానాకాలం సీజన్‌లో ముందస్తు సాగు చేసిన వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోతలు ముగిసిన అనంతరం రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, వెంటనే మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. అయితే ప్రభుత్వం వరికి కనీస మద్దతు ధరను సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్ ఏ రకానికి రూ.2,203లుగా నిర్ణయించింది. అయినప్పటికీ.. వ్యాపారులు (కమీషన్ ఏజెంట్లు) రైతుల నుంచి క్వింటా ధాన్యానికి రూ.3వేల నుంచి రూ.3,409 చెల్లిస్తున్నారు. దీంతో కర్షకులు ప్రైవేటు వారికే ధాన్యం విక్రయించేందుకు మక్కువ చూపుతుండటం గమనార్హం.

**రోజుకు పదివేల క్వింటాళ్లు**

సాధారణ ఎన్నికలు ముగిసీ ముగియగానే.. అనేక ప్రాంతాల్లో రైతులు వరి కోతలను మొదలు పెట్టారు. దీంతో షాద్‌నగర్ మార్కెట్ యార్డుకు దండిగా ధాన్యం తరలివస్తోంది. అక్టోబర్ నుంచి మార్కెట్‌లో వరి కొనుగోళ్లను ప్రారంభించగా.. పది రోజుల నుంచే ధాన్యం అధికంగా వస్తోంది. కాగా.. ఇప్పటి వరకు మార్కెట్‌కు 5,64,603 బస్తాల ధాన్యం (సుమారు 1,44,770 క్వింటాళ్లు) వ్యాపారులు కొనుగోలు చేశారు. రోజుకు పదివేల క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుమతి అవుతోందని మార్కెట్ అధికారులు తెలిపారు.

**మహబూబ్‌నగర్ నుంచి..**

స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన రైతులే కాకుండా.. చేవెళ్ల సెగ్మెంట్ షాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, రాజాపూర్ తదితర ప్రాంతాల నుంచి రైతులు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. అయితే మండల వ్యవసాయ అధికారులు.. రైతులు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారు అన్న విషయాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అందులో లేని రైతుల వివరాలను మార్కెట్ యార్డులో పొందుపరుస్తున్నారు.

**మంచిధర పలుకుతోంది..**



మూడు ఎకరాల భూమిలో వరిని సాగు చేశాను. 200 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. తినడానికి కొంత తీసుకొని, మిగితాది విక్రయించాను. తమ పంటను వ్యాపారులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సంతోషంగా ఉంది.

– ఆంజనేయులు, రైతు, శేరిగూడ, షాబాద్

**రూ.వెయ్యి అదనం**



గత సీజన్‌లో ధాన్యానికి ఆశించిన ధర లేదు. ఈ సీజన్‌లో మంచి రేటు పలుకుతోంది. క్వింటాకు రూ.వెయ్యి వరకు అదనంగా వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీంతో దిగుబడిని వారికే విక్రయిస్తున్నాం.

– హన్మంతు, రైతు, లింగారెడ్డిగూడ, ఫరూఖ్‌నగర్ మండలం

**భారీగా తీసుకొస్తున్నారు..**



కొన్ని రోజులుగా మార్కెట్ యార్డుకు రైతులు భారీగా ధాన్యం తీసుకొస్తున్నారు. వ్యాపారులు ఇప్పటి వరకు 1లక్షా 44వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేశారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.

– శ్రీనివాస్, సెక్రటరీ, షాద్‌నగర్ మార్కెట్ యార్డు

# కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

- ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం
- మన్నెగూడ సమీపంలో ఘటన



ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

**పూడూర్:** వేగంగా వెళ్తున్న కారు బోల్తా పడిన ఘటనలో ఐదుగురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం పూడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్ చెందిన ఐదుగురు కొందరు ఓ యూట్యూబ్ చానెల్ వారు టయోటా కారులో కొడంగల్ వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కావడంతో అక్కడ ఎలాంటి అభివృద్ధి జరగనుందోనన్న అంశంపై స్థానికుల అభిప్రాయం తెలుసుకునేందుకు వచ్చినట్లు సమాచారం. అక్కడి నుంచి తిరిగి నగరానికి బయల్దేరిన క్రమంలో మన్నేగూడ సమీపానికి రాగానే వారి కారు బోల్తా కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి మరో కారులో వైద్య చికిత్సకోసం నగరంలోని ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. కారు బోల్తా పడిన వెంటనే అందులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయిందని, దాంతో స్వల్ప గాయాలతో ఐదుగురు వ్యక్తులు బయటపడ్డారని స్థానికులు చెప్పారు.



క్షతగాత్రులు

# ఊరూరా 'వికసిత్ భారత్' సంకల్ప్‌యాత్ర

**చేవెళ్ల:** కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఊరూరా 'వికసిత్ భారత్' సంకల్ప్‌యాత్ర జరుగుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సర్పంచ్ శైలజ ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో 'వికసిత్ భారత్'ను వ్యవసాయ, మహిళా సమాఖ్యలు, ఆరోగ్యవైద్యశాఖ తరుపున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ పథకానికి అర్హులైన 50 మందికి ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఆయుష్మాన్‌తో పేదలకు అందించే వైద్య చికిత్స గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ యాత్ర ద్వారా ప్రచారం చేస్తోందని, అర్హులైన వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ అన్నయోజన తదితర పథకాలు అందే విధంగా చూడనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు బాలకృష్ణ, డీఈఓ రాఘవేందర్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు, బ్యాంక్ మేనేజర్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సంకల్ప్‌యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం